సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం | 2 | జూన్ | 2025



ముస్తాబవుతున్న దర్వేశిపురం

కనగల్ మండలంలోని దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం బ్రహ్మోత్స వాలకు ముస్తాబవుతోంది. - 9లో



గోశాలను సందర్శించిన ఈఓ

యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయా నికి అనుబంధంగా ఉన్న గోశాలను ఈఓ వెంకట్రావ్ పరిశీలించారు. - 9లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37°/28°

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఐదుగురు పోలీసులకు సేవా పతకాలు

భువనగిరి: జిల్లాకు చెందిన ఐదుగురు పోలీసులు సేవా పతకాలకు ఎంపికయ్యారు. విధి నిర్వహణలో భాగంగా అందించిన ఉత్తమ సేవలకు గాను సేవా పథకాలు దక్కాయి. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీరికి పతకాలు అందజేయనున్నారు. సేవా పథకాలకు ఎంపికైన పోలీసుల్లో కె.బిక్కునాయక్, ఏ.శ్రీనివాస్, ఎండీ యూసుఫ్, జి.మహేష్ ఉన్నారు.

అదనపు కలెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



భాస్కర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న భువనగిరి మున్సిపల్ కమిషనర్ రామలింగం

భువనగిరిటౌన్ : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా నియామకమైన భాస్కర్‌రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు అదనపు కలెక్టర్(రెవెన్యూ) వీరారెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్‌ప్రసాద్, భువనగిరి, ఆలేరు, మోత్కూరు మున్సిపల్ కమిషనర్లు రామలింగం డి.శ్రీనివాస్, సతీష్ పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

స్వర్ణగిరీశుడికి తిరువీధి ఉత్సవ సేవ

భువనగిరి : పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తిరువీధి ఉత్సవ సేవ నేత్రపర్వంగా చేపట్టారు. అంతకుముందు స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్యకల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 5వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం కర్పూర మంగళ హారతులు సమర్పించారు. సెలవు రోజు కావడం, వేసవి సెలవులు దగ్గరపడుతుండటంతో భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

నృసింహుడి సేవకు అవకాశం కల్పించాలి



ఈఓ వెంకట్రావ్‌కు వినతిపత్రం అందజేసి వివరిస్తున్న బూడిద వంశస్తులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బూడిద వంశస్తులకు (మాదిగ) సేవ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ యాదగిరిగుట్ట మండలంలోని యాదగిరిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన పలువురు ఈఓ వెంకట్రావ్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. టెండర్ నిర్వహించకుండా పాదరక్షల నిర్వహణ బాధ్యత ఇవ్వాలని, నిత్య కల్యాణంలో డప్పులు వాయించే అవకాశం కల్పించాలని కోరారు. దేవస్థానంలోని అన్ని విభాగాల్లోని ఉద్యోగాల్లో తమ కులస్తులను ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ కౌన్సిలర్ బూడిద సురేందర్, నాయకులు బూడిద జానీ, బూడిద నాగరాజు, బూడిద నరసింహ, బూడిద స్వామి, బూడిద శ్రీను, బూడిద మధు, నరేష్, శివ, మిధున్, మల్లేష్ తదితరులున్నారు.

నేడు ప్రజావాణి రద్దు

భువనగిరి : కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

సాగర్‌కు థాయ్‌లాండ్ బౌద్ధ భిక్షువులు

నాగార్జునసాగర్ : థాయ్‌లాండ్‌కు చెందిన బౌద్ధ భిక్షువులు ఆదివారం నాగార్జునసాగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధచరిత వనం, జాతకవనం, జ్ఞానవనం, స్థూపవనాలను పరిశీలించారు. మహాస్థూపంలోని జ్ఞానమందిరంలో కొంతసేపు ధ్యానం చేశారు. వీరి వెంట బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, మేనేజర్ తపతి శ్యాంసుందర్‌రావు తదితరులు ఉన్నారు.



విద్యుత్ దీపాల అలంకరణలో కలెక్టర్ కార్యాలయం

ఆవిర్భావ వేడుకలకు సిద్ధం

సాక్షి యాదాద్రి: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు సర్వం సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని అమరువీరుల స్థూపంతోపాటు కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ దీపాల వెలుగులతో కళకళలాడుతున్నాయి. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించే వేడుకలకు ముఖ్య అతిథిగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరుకానున్నారు. 9.15కు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తారు. 9.45కు జాతీయ పతాకావిష్కరణ ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం జిల్లా ప్రగతిపై ప్రసంగిస్తారు. ఆ తరువాత 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి సైకిళ్లు పంపిణీ చేయనున్నారు.

కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి

వేడుకలకు కలెక్టరేట్ ముస్తాబైంది. పోలీస్ పరేడ్ మైదానం సిద్ధం చేశారు. ఆహుతుల కోసం టెంట్లు, కుర్చీలు వేశారు.

భూభారతి అమలు దిశగా..

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

- 318 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహణ
- భూముల సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ
- సాదాబైనామాలకు కలగనున్న మోక్షం



సాక్షి, యాదాద్రి: భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం అమలుకు రెవెన్యూ యంత్రాంగం శ్రీకారం చుట్టబోతోంది. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనుంది. భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. వీటితో పాటు గతంలో వచ్చిన సాదాబైనమాలకు పరిష్కారం చూపనున్నారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఆత్మకూర్(ఎం) మండలంలో సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే.

20వరకు సదస్సులు

జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు, 17 మండలాలు, 318 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. 3 నుంచి 20వ తేదీ వరకు అన్ని రెవెన్యూ గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం సదస్సులు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సభ నిర్వహించి భూ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరిస్తారు. ధరణి పోర్టల్‌లో పరిష్కారం కాని సమస్యలను ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. వాటి ఆధారంగా దరఖాస్తు ఫారాలను కూడా సిద్ధం చేసింది. సమస్యలున్న రైతులకు సదస్సుల్లో దరఖాస్తు ఫారాలను అందజేస్తారు. భూ యజమానులు వాటిని పూర్తి చేసి అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. వాటితో పాటు పరిష్కారానికి నోచుకోని సమస్యలున్నా దరఖాస్తులు స్వీకరిస్తారు.

ఏరోజుకారోజు నివేదిక

రెవెన్యూ సదస్సులపై అధికారులు ఏరోజుకారోజు ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. సదస్సు ముగిసిన అనంతరం గ్రామంలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, అందులో ప్రభుత్వ భూములు, పట్టాభూములకు సంబంధించినవి ఎన్ని ఉన్నాయని లెక్కిస్తారు.సమస్యల వారీగా వచ్చిన దరఖాస్తులను వివరాలతో నివేదిక రూపొందించి కలెక్టర్‌కు అందజేస్తారు. జిల్లా కలెక్టర్ అదే రోజు నివేదికలను సీసీఎల్‌ఏకు పంపిస్తారు.

7,253 దరఖాస్తులు

సాధాబైనామా దరఖాస్తులకు భూభారతి చట్టం ద్వారా మోక్షం లభించనుంది. జిల్లా వ్యాప్తంగా 7,253 సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ధరణి పోర్టల్‌లో వాటి పరిష్కారానికి అవకాశం లేకపోవడంతో సాదాబైనామాలపై భూములు కొనుగోలు చేసిన వారు ఇంతవరకు హక్కులు పొందలేదు. వీటితోపాటు అప్పట్లో తిరస్కరణకు గురైన 8,741 సాదాబైనామా దరఖాస్తులను కూడా మరోసారి విచారణ చేస్తారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

షెడ్యూల్ ప్రకారం ప్రతి రెవెన్యూ గ్రామంలో సదస్సులు నిర్వహిస్తాం. రెవెన్యూ సదస్సుల్లో ప్రధానంగా సాదాబైనామాల దరఖాస్తులకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న యజమానులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలి.

– వీరారెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్

తహసీల్దార్లకు సిటిజన్ లాగిన్

భూభారతి చట్టం అమలులో భాగంగా ప్రభుత్వం తహసీల్దార్లకు సిటిజన్ లాగిన్ అవకాశం ఇచ్చింది. గతంలో మాదిరిగా ప్రతి చిన్న పనికి కలెక్టర్, సీసీఎల్‌ఏ వరకు వెళ్లాల్సిన పనిలేదు. రెవెన్యూ సదస్సులు ముగిసిన అనంతరం భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తారు. అందులో తహసీల్దార్ పరిధిలో పరిష్కరించేందుకు వీలున్నవి, సాధ్యంకాని వాటిని వేరు చేస్తారు. పరిష్కారానికి వీలున్న దరఖాస్తులను తహసీల్దార్ పరిష్కరిస్తారు. అనంతరం తనకు ఇచ్చిన సిటిజన్ లాగిన్‌లో వాటిని అప్‌లోడ్ చేస్తారు.

సాదాబైనామాల వివరాలు..

మండలం	దరఖాస్తులు	రిజెక్ట్	పెండింగ్
ఆత్మకూర్ (ఎం)	352	151	201
అడ్డగూడూరు	2,440	1510	930
ఆలేరు	776	437	339
భువనగిరి	1,234	699	535
బీబీనగర్	524	260	264
బొమ్మలరామారం	852	426	426
గుండాల	1,718	842	876
మోత్కూరు	983	655	328
మోటకొండూరు	672	349	323
తుర్కపల్లి	551	310	241
రాజాపేట	987	515	472
యాదగిరిగుట్ట	410	235	175
చౌటుప్పల్	460	296	164
పోచంపల్లి	575	362	213
నారాయణపురం	1,006	479	527
రామన్నపేట	1,071	456	615
వలిగొండ	1,383	759	624

మూడు నెలల బియ్యం పంపిణీ షురూ

- 515 రేషన్ షాపుల ద్వారా పంపిణీ
- జిల్లాలో 2,18,963 కార్డులు

భువనగిరిటౌన్ : మూడు నెలల పాటు సన్న బియ్యం పంపిణీ ఆదివారం జిల్లా వ్యాప్తంగా 515 రేషన్ షాపుల్లో ప్రారంభమైంది. రేషన్ దుకాణాల ద్వారా ఆహారభద్రత కార్డుదారులకు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించి మూడు నెలల సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

కార్డులు ఇలా..

జిల్లాలో 2,18,963 ఆహారభద్రత కార్డులు ఉండగా 6,71,147 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున మూడు నెలలకు గాను 18 కిలోల బియ్యం, అంత్యోదయ కార్డుదారులకు ఒక్కొక్కరికి 35 కిలోల లెక్కన మూడు నెలలకు గాను 105 కిలోల బియ్యం చొప్పున ఇస్తున్నారు.



భువనగిరిలో బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

ఈపీవోస్ రసీదులు మూడు నెలలకు విడిగా ఇస్తున్నారు. భువనగిరిలోని పలు రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీని ఆర్డీఓ కృష్ణారెడ్డి, తహసీల్దార్ అంజిరెడ్డి అంజిరెడ్డి పరిశీలించారు. ప్రతి కార్డు దారుడు బియ్యం తీసుకెళ్లాలని కోరారు.

బడిబాటను విజయవంతం చేయాలి

భువనగిరి : బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువకులు, మహిళా స్వయం సహాయక సంఘాలను భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విషయం, డిజిటల్ బోధన, సుశిక్షితులై ఉపాధ్యాయులు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, ఇతర సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఈనెల 6నుంచి 19వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.



భువనగిరి మండలం కూనూరులో విత్తనాలు వేసేందుకు దుక్కి దున్ని సిద్ధంగా ఉన్న భూమి

‘సాగు’దామా.. ఆగుదామా?

- అయోమయంలో అన్నదాతలు
- ఈసారి ముందే కురిసిన వర్షాలు
- మూడు రోజులుగా మళ్లీ ఎండలు
- విత్తనాలు వేయడానికి వెనుకడుగు

భువనగిరి: తొలకరి వర్షాలకు సాగు బాట పట్టిన రైతులు అయోమయంలో పడ్డారు. మూడు రోజులుగా మళ్లీ ఎండలు దంచికొడుతుండటంతో ‘సాగు’దామా.. వేచి చూద్దామా అనే సందేహంలో ఉన్నారు. రోహిణి కార్తెలో రోకళ్లు పగులుతాయని సామెత ఉండగా.. దీనికి విరుద్ధంగా వాతావరణం చల్లబడింది.నిర్ణీత సమయం కంటే పక్షం రోజులు ముందుగానే వర్షాలు కురిశాయి. గత ఏడాది మే నెలాఖరులో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈసారి 30 నుంచి 40 డిగ్రీల లోపే నమోదయ్యాయి. తొలకరి వర్షాలకు చాలా మంది రైతులు సాగుబాట పట్టారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచారు.

ఇప్పటి వరకు 30 శాతం విత్తనాలు పూర్తి

వరి 2.95 లక్షల ఎకరాలు, పత్తి 1.15 లక్షల, కందులు 6వేల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ముందుగా కురిసిన వర్షాలతో పత్తితో పాటు ఇతర ఆరుతడి పంటలు 30 శాతం వరకు సాగు చేశారు. మిగతా రైతులు కూడా దుక్కులు దున్నడం, చేలలో పత్తి, కంది కట్టె ఏరడం, చెత్తను కాల్చివేయడం లాంటి పనులు పూర్తి చేశారు. కానీ, మూడు రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో విత్తనాలు వేసేందుకు రైతులు వెనుకాడుతున్నారు. విత్తనాలు విత్తిన తరువాత వర్షాలు కురువకపోతే గింజలు భూమిలో మాడిపోయే ప్రమాదం ఉందని, మళ్లీ విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తుందన్న ఆలోచనలో పడ్డారు.



మోటకొండూరులోని ఓ రైతు తన ఇంట్లో భద్రపరిచిన పత్తి విత్తనాలు

ఉష్ణోగ్రతల నమోదు (డిగ్రీలలో)

తేదీ	కనిష్ట	గరిష్ట
మే 25	31	35
26	29	32
27	29	35
28	29	34
29	28	35
30	29	37
31	30	38
జూన్ 1	30	38

అయోమయంగా ఉంది



మాకు ఏడు ఎకరాల భూమి ఉంది. ఈసారి ముందుగానే వర్షాలు రావడంతో దుక్కులు దున్నాం. మూడు ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశాం. ఇంకా నాలుగు ఎకరాల్లో విత్తనాలు వేయాల్సి ఉంది. గత ఐదు రోజుల నుంచి వర్షాలు లేవు. పైగా ఎండలు మండుతున్నాయి. దీంతో విత్తనాలు వేయాలా, వద్దా అని అయోమయంగా ఉంది.

–గంజి పురుషోత్తంరెడ్డి, రైతు, మోటకొండూరు

• యాదగిరి క్షేత్రంలో కోలాహలం



ఆలయ మాడ వీధుల్లో కిక్కిరిసిన భక్తులు

యాదగిరిగుట్ట: నిత్యపూజలు, భారీగా తరలివచ్చిన భక్తులతో యాదగిరి క్షేత్రం ఆదివారం కోలాహలంగా మారింది. వేకువజామున సుప్రభాత సేవతో నిత్యారాధనలు ఆరంభించిన అర్చకులు.. రాత్రి వేళ మహా నివేదన, శయనోత్సవ పర్వాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. తొలుత ఉదయం గర్భగుడిలో కొలువైన స్వయంభూలు, సువర్ణ ప్రతిష్టా అలంకారమూర్తులను అభిషేకించి అర్చనలు చేశారు.అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తుల నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు.రాష్ట్ర నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు ఆయా వేడుకల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

వయోవృద్ధులకు బాసట

చేయూతనిస్తున్న తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్

- వారి సమస్యల పరిష్కారానికి కృషి
- వయోధికుల చట్టంపైనా ప్రచారం



బూరుగుపల్లిలో వయోధికుల చట్టంపై అవగాహన కల్పిస్తూ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు

రాజాపేట : బిడ్డలను ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు ఎంతగానో శ్రమించిన వృద్ధులు జీవిత చరమాంకంలో ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారు. కన్నబిడ్డలు వారిని సరిగా పట్టించుకోకపోవడంతో శారీరకంగా, మానసికంగా, ఆర్థికపరంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి వారికి తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ బాసటగా నిలుస్తోంది. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా వయోధికుల సంక్షేమ చట్టంపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది.

అసోసియేషన్ చేపడుతున్న కార్యక్రమాలివీ..

మలి వయస్సులో సంతానం దగ్గర లేకపోవడం, ఉన్నవారు తమతల్లిదండ్రుల బాగోగులను పట్టించుకోవడం లేదు. తల్లిదండ్రుల ఆస్తులను అనుభవిస్తున్నారే తప్పా.. వారికి తిండి కూడా పెట్టని ఘటనలు వెలుగుచూస్తున్నాయి. దీంతో చరమాంకంలో మానసికంగా, శారీరకంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయినా వృద్ధుల సంక్షేమం, భద్రతకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదు. ఈ క్రమంలో 60 ఏళ్లు దాటిన కొందరు వ్యక్తులు 2016లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్‌గా ఏర్పడి వయోవృద్ధుల సంక్షేమం కోసం తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్నారు. తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ బాధ్యతలు విస్మరించిన కుమారులను వయోవృద్ధుల ట్రిబ్యునల్ ద్వారా దారిలో పెడుతున్నారు.



మల్లగూడెంలో అవగాహన కల్పిస్తున్న సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రగుంట వెంకటేశం

వయోధికుల చట్టంపైనా అవగాహన .. రాజాపేటలో నిర్వహించిన వయోవృద్ధుల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ చేయూత జిల్లా ప్రధాన కార్యదర్శి. వయోవృద్ధుల సంక్షేమం కోసం వయోధికుల చట్టం ఉంది. కానీ, చాలా మందికి ఈ చట్టం ఉందన్న విషయం తెలియదు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు వయోధికుల చట్టంపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు.

- ❖ చట్టంలోని నిబంధనలు తెలిపే ఫ్లెక్సీలు ఏర్పాటు, కరపత్రాలను పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు.
- ❖ వయోధికులకు రక్షణగా ఉండేందుకు గ్రామ కమిటీలు, మండల కమిటీలు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు.
- ❖ వారి సంక్షేమం కోసం, మానసిక ఉల్లాసం కల్పించేందుకు జిల్లా కేంద్రంలో రూ.200 కోట్లతో డే కేర్ సెంటర్ మంజూరైంది.
- ❖ తల్లిదండ్రుల నుంచి పొందిన ఆస్తిని కుమారుల నుంచి తిరిగి తల్లిదండ్రులకు వచ్చే విధంగా వయోవృద్ధుల ట్రిబ్యునల్ ద్వారా కృషి చేస్తున్నారు.

వృద్ధుల సంరక్షణ బాధ్యత పిల్లలదే..



వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ బాధ్యతను వారి పిల్లలు, వారసులు బాధ్యతగా స్వీకరించాలి. సంతానం నుంచి నిర్లక్ష్యానికి గురైన బాధితులు సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులకు తెలియజేస్తే ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషిచేస్తాం. ట్రిబ్యునల్ చట్టప్రకారం చర్యలు తీసుకుంటుంది. వయోవృద్ధుల సంక్షేమం కోసం జిల్లా కేంద్రంలో సుమారు రూ. 200 కోట్లతో డే కేర్ సెంటర్ మంజూరైంది.

– యర్రగుంట వెంకటేశం, తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అవగాహన కల్పిస్తున్నాం



వయోధికుల సంక్షేమ చట్టం వాటి ప్రయోజనాలపై మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ కరపత్రాలను పంపిణీతో విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామ కమిటీలను ఏర్పాటు పూర్తి చేయడం జరిగింది. వయోధికులు తమ సమస్యలను గ్రామ కమిటీల దృష్టికి తీసుకవస్తే పరిష్కారం కోసం కృషిచేస్తాం.

– బల్ల దామోదర్, వయోధికుల సంక్షేమ సంఘం రాజాపేట మండల అధ్యక్షుడు

క్లుప్తంగా

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

తిప్పర్తి : అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తిప్పర్తి మండలం రాయినిగూడెం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం రాజుపేట గ్రామానికి చెందిన చెన్నోజు గణేష్ (25) కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నెల రోజుల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న గణేష్ జీవితంపై విరక్తితో ఆదివారం ఉదయం రాయినిగూడెం సమీపంలో గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా.. బాలిక మృతి

గుర్రంపోడు: ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో బాలిక మృతిచెందింది. ఈ ఘటన గుర్రంపోడు మండలం కాచారం గ్రామ స్టేజీ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం చామలేడు గ్రామానికి చెందిన పర్సనబోయిన రమేష్ ఆదివారం తన కుమార్తె శ్రీజ(11), కుమారుడు శివను తీసుకుని తన సొంత ఆటోలో మామిడికాయలు అమ్మడానికి కొండమల్లేపల్లికి వెళ్లి సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో గుర్రంపోడు మండలం కాచారం గ్రామ స్టేజీ వద్ద గేదెలు అడ్డురావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శ్రీజకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. రమేష్, అతడి కుమారుడిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీజ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి పూర్తి చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

హుజూర్‌నగర్: మద్యం తాగి ఇంట్లో నిద్రించిన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన హుజూర్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. ఆదివారం ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని దీక్షిత్‌నగర్‌కు చెందిన ఆలకుంట్ల గోపమ్మ తమ్ముడు చింతల రాములు(20) తన స్నేహితుడితో కలిసి మే 30వ తేదీన మద్యం తాగాడు. అనంతరం రాములు ఇంటికి వెళ్లి నిద్రించాడు. మరుసటి రోజు ఉదయం రాములు నిద్ర లేవకపోవడంతో గోపమ్మ తన బంధువుల సహాయంతో తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా.. అతడు బెడ్ పక్కన అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆదివారం మృతుడి అక్క గోపమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సులో సీటు కోసం భక్తుల పోటీ



యాదగిరిగుట్ట పైన బస్సుల్లో ఎక్కేందుకు పోటీ పడుతున్న భక్తులు

యాదగిరిగుట్ట: వేసవి సెలవులు ముగుస్తుండటంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శనం కోసం వచ్చేందుకు, దర్శనం అనంతరం కొండ కిందకు దిగేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించారు. దీంతో కొండ పైన, కొండ కింద గల బస్టాండ్‌ల వద్ద భక్తులు బారులుదీరారు. మధ్యాహ్నం సమయంలో భక్తులు అధికంగా బస్సుల్లో ఎక్కడానికి పోటీ పడ్డారు. సీట్ల కోసం కిటికీల్లో నుంచి బస్సుల్లోకి దూరారు. బస్సుల్లో సామర్థ్యానని మించి భక్తులు ప్రయాణిస్తూ కనిపించారు. రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించాలని, దీనిపై ఆర్టీసీ, ఆలయాధికారులు స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న దర్వేశిపురం

- 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉత్సవాలు
- 6న కల్యాణం
- ఏర్పాట్లు పూర్తిచేసిన దేవాదాయ శాఖ అధికారులు



దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం



ఆలయంలోని విగ్రహాలకు పూర్తయిన పెయింటింగ్

కనగల్: నల్లగొండ జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన కనగల్ మండలంలోని దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం, లైటింగ్ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఆలయం వద్ద సెంట్రల్ లైటింగ్, వంతెన నిర్మాణం, రెండు వరుసల రోడ్డు, డ్రెయినేజీ పనులు పూర్తవడంతో ఈసారి ఉత్సవాలకు నూతన శోభ వచ్చింది.

6న అమ్మవారి కల్యాణం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ తేదీన నిత్య పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభిస్తారు, అదే రోజు సాయంత్రం ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించనున్నారు. 6వ తేదీన రేణుకా ఎల్లమ్మ కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తెలిపారు. అనంతరం 7వేల నుంచి 10వేల మంది భక్తులకు అన్నదాన చేయనున్నారు. 7వ తేదీన 108 కలశములతో అష్టోత్తర శతఘటాభిషేకం, సాయంత్రం 4గంటలకు పర్వతగిరి, దర్వేశిపురం గ్రామాల నుంచి బోనాలు వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

హాజరుకానున్న కోమటిరెడ్డి, గుత్తా..

ఈ ఉత్సవాలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి పట్టువస్త్రలు సమర్పించనున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఇప్పటికే ఆలయం వద్ద లైటింగ్, చలువ పందిళ్లు, తాగునీటి వసతి, పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలు కల్పించాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటున్నాం. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి.

– జల్లేపల్లి జయరామయ్య, ఈఓ

ఘనంగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు



రాజగోపాల్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బోయలపల్లి రేఖ



అర్వపల్లిలో కేక్ కట్ చేస్తున్న బోయలపల్లి రేఖ, కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి: మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం అర్వపల్లిలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా అడివెంల గ్రామంలో కూడా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. మునుగోడులో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని రేఖ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు వేములకొండ పద్మ, ప్రధాన కార్యదర్శి దివ్య, జయమ్మ, మేకల రాంబాబు, జాజుల వీరయ్య, బాసపోలు శ్రీను, బొరోజు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, చిత్రంలో ఎమ్మెల్సీ సత్యం, వర్రె వెంకటేశ్వర్లు

నల్లగొండ : యాదవ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి వృత్తి గౌరవాన్ని కాపాడాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా యాదవ సంఘ భవనంలో నూతన యాదవ ఉద్యోగుల ఆత్మీయ సన్మానోత్సవంలో ఆయన మాట్లాడారు. నూతన ఉద్యోగులంతా తమ శక్తి మేరకు, కుటుంబ సభ్యుల సహకారంతో ఉద్యోగాలు పొందిన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. గొల్లకురుమలు నీతికి నిజాయితీకి మారుపేరని, నూతనంగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన యాదవులు అంకితభావంతో పని చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర పోలీస్ కంప్లయింట్ అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లును సన్మానించారు. కార్యక్రమంలో బడుగుల లింగయ్యయాదవ్, జవ్వాజి వెంకటేశంయాదవ్, తరాల పరమేశ్‌యాదవ్, అర్వ అశోక్‌యాదవ్, బెల్లి యాదయ్య, లొడంగి గోవర్ధన్, ముచ్చర్ల ఏడుకొండలు, దూదిమెట్ల బాలరాజుయాదవ్, పిల్లి రామరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో కలిసి.. పత్తి విత్తనాలు విత్తి..



రాజకీయాల్లో ఎప్పుడు బిజీగా ఉండే తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు ఆదివారం అడ్డగూడూరు మండల కేంద్రం మీదుగా తన స్వగ్రామం ధర్మారం వెళ్తూ పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలను చూసి ఆగారు. వారి వద్దకు వెళ్లి పలకరించి వారితో పాటు సరదాగా పత్తి విత్తనాలు నాటారు. – అడ్డగూడూరు

యాదగిరిగుట్ట ఆలయ గోశాలను సందర్శించిన ఈఓ

- లక్ష్మీ పుష్కరిణిలో నీరు అపరిశుభ్రంగా ఉండడంతో సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశం



గోశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా మల్లాపురం వెళ్లే దారిలో ఉన్న గోశాలను ఈఓ వెంకట్రావ్ ఆదివారం పరిశీలించారు. గోశాలలో ఎన్ని గోవులు ఉన్నాయి, ప్రతిరోజు పాలు లీటర్ల ఇస్తాయి, వాటి సంరక్షణ ఏవిధంగా ఉందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. గోవులకు నాణ్యమైన గ్రాసం అందించడంతో పాటు వాటికి ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా టీకాలు వేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కొండ కింద లక్ష్మీ పుష్కరిణి చెంత ఉన్న కల్యాణ కట్టను సందర్శించారు. అక్కడ భక్తులను అడిగి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. తర్వాత కల్యాణ కట్టలో భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని నాయీ బ్రాహ్మణులకు సూచించారు. భక్తుల నుంచి అధిక ధరలు వసూలు చేయొవద్దని, దుకాణదారులకు తెలిపారు. లక్ష్మీ పుష్కరిణిలో నీరు అపరిశుభ్రంగా ఉండటంతో సంబంధిత అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్‌ను సస్పెండ్ చేయాలని అధికారులకు ఈఓ ఆదేశాలు జారీ చేశారు. కొండ కింద భక్తులు బస చేసే దేవస్థానం గదులను తనిఖీ చేశారు. వాటర్ లీకేజీ సమస్య ఉండగా వెంటనే ఇంజనీరింగ్ అధికారులను పిలిపించి మరమ్మతులు చేపట్టాలన్నారు. కొండ కింద పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంతకుముందు కొండ పైన భక్తులు క్యూలైన్లలో పడుతున్న ఇబ్బందులను నేరుగా తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ ఈఓ దోర్బాల భాస్కర్‌శర్మ, అధికారులు దయాకర్‌రెడ్డి, శంకర్‌నాయక్ తదితరులున్నారు.

మెడికల్ కళాశాలకు రిటైర్ట్ టీచర్ మృతదేహం అప్పగింత



జార్జి (ఫైల్)

కోదాడరూరల్: కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర బండపాలెంకు చెందిన రిటైర్డ్ టీచర్ బచ్చలకూరి జార్జి(80) అనారోగ్యంతో శని వారం సాయంత్రం మృతిచెందారు. జార్జి కోరిక మేరకు ఆయన మృతదేహాన్ని కుమారుడు మృత్యుంజయ్, కుమార్తెలు చైతన్య, కల్పన, ప్రతిభ కలిసి సూర్యాపేట మెడికల్ కళాశాలకు అప్పగించారు. నేత్రాలను ఖమ్మం నేత్ర నిధికి దానం చేశారు. జార్జి భౌతికకాయంపై రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉపాధ్యా సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు.

సీసీఎస్ సీఐ డానియల్‌ను సస్పెండ్ చేయాలి

- నల్లగొండ ఎస్పీ కార్యాలయం ఎదుట మృతురాలి తల్లి నిరసన



మృతురాలి తల్లితో మాట్లాడుతున్న నల్లగొండ టూటౌన్ పోలీసులు

నల్లగొండ: తన కుమార్తె మృతికి కారణమైన సీసీఎస్ సీఐ డానియల్‌ను సస్పెండ్ చేయాలని మృతురాలి తల్లి పక్షుల పద్మ ఆదివారం రాత్రి నల్లగొండ ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది కుటుంబ సమస్యలతో న్యాయం కోసం నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన శిల్ప అనే మహిళతో అప్పటి సీఐ డానియల్ వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు ఆరోపణలు రావడంతో అతడిని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఆ తర్వాత నల్లగొండ సీసీఎస్ సీఐగా డానియల్‌ను నియమించారు. అయితే గత నెల 22న నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లులో గల ఛాయాసోమేశ్వర ఆలయానికి శిల్పను డానియల్ రమ్మని చెప్పడంతో ఆమె వెళ్లిందని, వారిద్దరు రోడ్డు పక్కన నడుస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం వచ్చి శిల్పను ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. తన కుమార్తెతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఆమె జీవితాన్ని చిన్నాభిన్నం చేసి ఆమె మృతికి కారణమైన సీఐ డానియల్‌ను సస్పెండ్ చేయాలని శిల్ప పిల్లలతో కలిసి ఆమె తల్లి ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపింది. విషయం తెలుసుకున్న నల్లగొండ టూటౌన్ సీఐ రాఘవరావు ఎస్పీ కార్యాలయం వద్దకు వచ్చి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆమె ఆందోళన విరమించింది.

యాదగిరి క్షేత్రంలో ఉద్యోగుల బదిలీలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పలువురు ఉద్యోగులకు అంతర్గతంగా స్థానం చలనం కల్పించారు. ప్రధానాలయంతో పాటు శివాలయం, పాతగుట్ట, ప్రసాద విక్రయ శాల, రామానుజకూటం తదితర విభాగాలకు బదిలీ చేస్తూ ఈఓ వెంకట్రావ్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

- పాతగుట్ట, గోశాల, కొండ కింద చౌల్ట్రీస్, వ్రత, వాహన పూజలు, వాహనాల రుసుము కౌంటర్, ఆర్టీసీ బస్సుల నిర్వహణ, మల్లాపురం తోటలు, కల్యాణకట్ట, లక్ష్మీ పుష్కరిణి, దబ్బగుంటపల్లిలో విధులు నిర్వహిస్తున్న ఏఈఓ జె.కృష్ణను... ప్రధానాలయం, శివాలయం, ప్రచారశాఖ, డోనర్ సెల్, శాశ్వత పూజలు, సబ్ టెంపుల్స్ బదిలీ చేశారు.
- ఏఈఓ రమేష్‌బాబును ప్రధాన కార్యాలయం, గోదాం విభాగం, ప్రొటోకాల్, లాకర్స్, పాతగుట్ట, గోశాల, మల్లాపురం తోటలు, దత్తత ఆలయాలకు పంపారు.
- ఏఈఓ రఘును అన్నదానం, కొండ కింద చౌల్ట్రీస్, వ్రత, వాహన పూజలు, వాహన ప్రవేశ రుసుము కౌంటర్, ఆర్టీసీ బస్సు నిర్వహణ, కల్యాణ కట్ట, లక్ష్మీ పుష్కరిణికి బదిలీ చేశారు.
- ఏఈఓ నవీన్‌కుమార్‌ను ప్రసాద విక్రయశాల, కొండపైన, కొండ కింద శానిటేషన్, ఇ-గవర్నెన్స్, ఆన్‌లైన్‌కు బదిలీ.
- పర్యవేక్షకులు ఎ. సత్యనారాయణశర్మను ప్రధానాలయం, డి. రామారావును ప్రసాద విక్రయ శాల, సీనియర్ అసిస్టెంట్ డి.రామారావును ఆలయ స్టోర్స్ గుమస్తాగా, జి.అర్జున్‌కుమార్‌ను ప్రసాద విక్రయం ప్రిపరేషన్ గుమాస్తాగా, పాచక కె. లక్ష్మణాచార్యులను ప్రసాద విక్రయ శాల, సహాయ పాచకులు ఎస్. కృష్ణమాచార్యులు పాతగుట్ట రామానుజకూటానికి బదిలీ చేశారు. అదేవిధంగా ఎస్‌బి. సంతోష్‌ను ప్రధానాలయ రామానుజకూటం, కె.వేణుగోపాల చార్యులను ప్రసాద విక్రయశాలకు బదిలీ చేస్తూ ఈఓ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తక్షణమే వారిని ఆయా విభాగాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ



చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో హైదరాబాద్ మార్గంలో బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ కొనసాగింది. వేసవి సెలవులు ముగుస్తుండడంతో పాటు శుభ కార్యాలకు, గ్రామ దేవతల పండుగలకు వెళ్లే వారితో ఈ రద్దీ నెలకొంది. ఉదయం విజయవాడ మార్గంలో రద్దీ ఉండగా.. సాయంత్రం నుంచి అర్ధ రాత్రి వరకు హైదరాబాద్ మార్గంలో వాహనాలు బారులుదీరాయి. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో వారాంతపు సంత ఉండడంతో ఈ రద్దీ కారణంగా జనాలు అవస్థలు పడ్డారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ

- రూ.19.66 లక్షలు ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు



ఎస్‌బీఐ ఏటీఎంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఏటీఎంలోని రూ 19.66 లక్షల నగదు అపహరించిన గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎంకు నిప్పు పెట్టి పరారయ్యారు. సీఐ చరమంద రాజు, ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం .. హుజూర్‌నగర్ పట్టణంలోని లింగగిరి రోడ్డులో గల ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు ఆదివారం తెల్లవారుజామున నలుగురు వ్యక్తులు ఫార్చునర్ కారులో వచ్చి అనుమానాస్పదంగా కనిపించడంతో ఓ లారీ డ్రైవర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఏటీఎం వద్దకు వెళ్లేసరికి గుర్తుతెలియని వ్యక్తులు నగదు అపహరించి ఏటీఎంకు నిప్పు పెట్టి పరారయ్యారు. పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలను ఆర్పివేశారు. ఏటీఎం మిషన్‌ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తుండగా కొంత నగదు కాలిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఏటీఎం నిర్వాహకులు శుక్రవారం ఏటీఎం మిషన్‌లో రూ.26 లక్షలు పెట్టగా అందులో దొంగతనం జరిగే సమాయానికి రూ.19.66లక్షల వరకు ఉన్నాయని ఏటీఎం ఫైనాన్షియల్ సాఫ్ట్‌వేర్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన గంగాధర్ మూర్తి తెలిపారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

ఐదు టీంలతో గాలింపు..

నిందితుల కోసం పోలీసులు ఐదు టీంలతో గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల ద్వారా నిందితులు ప్రయాణించిన ఫార్చునర్ కారు వివరాలను సేకరించారు. క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు.

ముందే హెచ్చరించిన పోలీసులు..

ఏటీఎం సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని లేదా రాత్రివేళ ఏటీఎంలను మూసివేయాలని సీఐ చరమంద రాజు ఆదేశాలతో ఎస్ఐ ముత్తయ్య ఐదు రోజుల క్రితమే బ్యాంకు అధికారులకు నోటీసులు ఇచ్చారు. హుజూర్‌నగర్ పట్టణంలో ఎస్‌బీఐ బ్యాంక్‌కు నాలుగు ఏటీఎంలు ఉన్నాయని ఆయా ఏటీఎంలలో ఏది జరిగినా బ్యాంక్ అధికారులే బాధ్యత వహించాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. పోలీసుల సూచనలు పాటించినట్లైతే దొంగతనం జరిగే అవకాశం ఉండేది కాదని పలువురు పేర్కొంటున్నారు.

కొమ్మల కత్తిరింపులతో మామిడిలో అధిక దిగుబడులు

- ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మురళి సూచనలు

పాడిపంట



గుర్రంపోడు: మామిడి తోటల్లో మామిడి మొక్కలు నాటిన ప్పటి నుంచి కొమ్మలు జాగ్రత్తగా కత్తిరిస్తే చెట్టుకు మంచి ఆకృతి వస్తుందని, కొమ్మల కత్తిరింపు వల్ల చెట్టుకు గాలి, సూర్యరశ్మి బాగా ప్రసరించి అధిక దిగుబడులు వస్తాయని ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మురళి చెబుతున్నారు. ప్రస్తుతం మామిడి కాయల కోతలు పూర్తయ్యాయి. ఈ సమయంలో మామిడి తోటల్లో చెట్ల కొమ్మలు కత్తిరించాలని ఆయన సూచిస్తున్నారు.

చిన్న మొక్కల నుంచే కత్తిరింపులు..

మొక్క మూడు, నాలుగు అడుగులు పెరగనిచ్చి ఆ తర్వాత బలమైన పక్క కొమ్మలు ఏపుగా పెరిగేలా చూడాలి. అంతవరకు కాండంపై కొమ్మలను రాకుండా తీసివేయాలి. ఆపై మూడు ప్రథమ కొమ్మలు ఒకే చోట పుట్టకుండా ఒక్కో కొమ్మ 9 అంగుళాల దూరం వచ్చేలా చూడాలి. మొట్టమొదట వచ్చిన ప్రధాన కొమ్మలను ప్రథమ కొమ్మలనుకుంటే, ఒక్కో ప్రథమ కొమ్మకు 3 ద్వితీయ కొమ్మలు, ఒక్కో ద్వితీయ కొమ్మకు మూడు తృతీయ కొమ్మలు, ఒక్కో తృతీయ కొమ్మకు మూడు చతుర్ధ కొమ్మలు వచ్చేలా మొక్కలు నాటినప్పటి నుంచి ప్రతి చెట్టులో 243 కొమ్మలు ఏర్పడతాయి. ఈ కొమ్మలన్నీ క్రమపద్ధతిలో పెరగడం వల్ల నలుదిశలూ వ్యాపిస్తాయి. ఈ కొమ్మలన్నీ ఒకదానిపై మరొకటి రానందున, చిక్కు కొమ్మలు ఏర్పడనందున మంచి దిగుబడులు వస్తాయి. చిన్న మొక్కకు సకాలంలో సరైన కత్తిరింపులతో పెద్ద చెట్టయ్యాక మంచి ఆకారంతో పాటు నాణ్యమైన దిగుబడులు వస్తాయి.

గాలి, సూర్యరశ్మి కీలకం

ఆకులు సూర్యరశ్మి సహాయంతో కిరణజన్య సంయోగ క్రియ జరుపగల సామర్థ్యం కల్గి ఉంటాయి. దీని ద్వారా చెట్టుకు కావాల్సిన ఆహార పదార్థాలు తయారై శ్వాస ద్వారా శక్తిగా మారి ఎదుగుదలకు, పుష్పించేందుకు, కాయలు వృద్ధిచెందేందుకు తోడ్పడతాయి. ఆకులు గుబురుగా ఉంటే సూర్యరశ్మి, గాలి తీసుకోక చెట్టులో ఆహారపదార్థాల ఉత్పత్తి తగ్గిపోయి దిగుబడి తగ్గిపోతుంది. చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. ఈ సమస్యల పరిష్కారానికి మామిడిలో కత్తిరింపులు తప్పనిసరిగా చేసుకోవాలి.

కొమ్మల కత్తిరింపుల విధానం..

- కాయలు కోసిన తర్వాత 15 నుంచి 20 రోజులు చెట్టుకు విశ్రాంతినివ్వాలి. అప్పుడే కొంత బలాన్ని పుంజుకుంటాయి.
- విశ్రాంతి నిచ్చిన తర్వాత కొమ్మల కత్తిరింపులు ప్రారంభించి ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలి.
- అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలు, తెగులు సోకి ఎండిన కొమ్మలను పూర్తిగా కత్తిరించాలి.
- వ్యవసాయ పనులకు అడ్డంగా లేకుండా నేలను తాకుతున్న కొమ్మలను మొదటికి కత్తిరించి తొలగించాలి.
- ఎండిన పూత, కాడల ద్వారా ఎండు తెగులు వ్యాపించే అవకాశం ఉన్నందున వాటిని తొలగించాలి.
- గుబురుగా పెరిగిన చెట్లలో సూర్యరశ్మి, గాలి లోపలకు ప్రసరించేలా తలపై మూడు, నాలుగు అంగుళాల మందం ఉన్న కొమ్మలను కత్తిరించి ఖాళీ స్థలం చేయాలి. దీనివల్ల మధ్యాహ్న సమయంలో ఎండ మొదలుపై పడుతుంది.
- తూర్పు, పడమర దిశల్లోనూ 2 నుంచి 3 అంగుళాల మందమున్న కొమ్మలను కత్తిరించి కొమ్మల మధ్యలో ఖాళీ స్థలం ఏర్పడేలా చేయడం వల్ల సూర్యుడు తూర్పు నుంచి పడమర దిశకు ప్రయాణించేటప్పుడు సూర్యరశ్మి ఖాళీ స్థలం గుండా లోపలకు ప్రసరిస్తుంది.
- కొమ్మలు ఎక్కువగా వచ్చే బంగనపల్లి రకం చెట్లలో కత్తిరింపులు తప్పనిసరి చేసుకోవాలి.
- చెట్ల కొమ్మలు కత్తిరించడం వల్ల కొత్తగా పుట్టుకొచ్చే లేత కొమ్మలు 4 నుంచి 5 నెలలకే ముదిరి పూతకు వస్తాయి. కత్తిరించిన కొమ్మల నుంచి వచ్చిన లేత కొమ్మలు డిసెంబర్‌లో మంచి పూత పూస్తాయి.
- కత్తిరింపులు పూర్తయిన వెంటనే మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి చెట్టు బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

యాజమాన్య పద్ధతులు..

- రాలిపోయిన కాయలు, పండ్లు, ఎండుపుల్లలను, చెట్ల మొదళ్లలో ఎండిన బెరడును తీసివేసి శుభ్రం చేసుకొని దున్నుకోవాలి.
- మొదటి దఫా ఎరువులు వేసుకోవాలి.
- నీటి వసతి ఉన్న చిన్న తోటల్లో అంతర పంటలు వేసుకోవచ్చు.
- లేత ఆకులు వచ్చిన మొక్కలకు సూక్ష్మధాతు మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.